# ప్రతీకారం

వచ్చేవచ్చే లారీకాస్త చటుక్కున ఆగిపోయింది. దావూద్ దిగి, లారీ చుట్టు ఓ ప్రదక్షిణంచేసి, లోపల లోపల నవ్వుకుంటూ వచ్చి నిలబడ్డాడు. గడ్డం క్రింద చెయ్యిపెట్టుకుని నీటుగా నుంచోటం, ఆ వయ్యారం, ఆ కళ్ళల్లో గర్వం, చూస్తూ చూస్తూ, చలమయ్య దొర వూరుకోలేక పోయాడు.

'ఏం దావూద్ ఏమిటా పొగరు, బండి ఆపేశావే....' చలమయ్య గద్దించాడు.

'అదే ఆగిపోయింది దొర. నేనూ చూస్తున్నా ఏమిటా అని.' దావూద్ ఇంజన్ దగ్గరకు వెళ్ళి, చెయ్యిపెట్టి సవరిస్తున్నాడు.

చలమయ్యకు మండిపోతోంది. గట్టిగా లోపల తిట్టాడు. దావూద్‌ను ఆపళంగా మింగేద్దామకుకున్నాడు. 'దావూద్' అని గట్టిగా పిలుద్దామనుకున్నాడు. ఓ మూల వెనకాలనుంచి లారీలు వచ్చిపడతాయి. తాను వేసుకున్న ప్లానంతా మంటకలిసిపోతుంది. ముందర తానే బస్తీ వెళ్ళి, సిమెంటు బస్తాలు యింకా దొరకవు అని పుకారు పుట్టించి, వాట న్నింటిని హెచ్చు ధరకు అమ్ముకోవాలి. ఇంతా కష్టపడి సమయానికి బస్తీ చేరుకోకపోతే, నోట్లో మట్టి పడ్డట్లే. చలమయ్య ఒళ్లంతా కంపరం

యెత్తిపోతోంది. తన చెవుల్లో, వెనకాలనుంచి లారీలు వస్తున్నట్లు గింగురుమంటోంది.

'ఎంతవరకు వచ్చిందేమిటి....' స్థాయి తగిస్తూ చలమయ్య లారీ దిగాడు.

దావూద్ ఆయాసపడుతున్నాడు. మొహం అంతా చెమటలు కమ్ముకున్నాయి. చేతులన్నీ నల్లపడిపోయినాయి. నూనెగామాలు చొక్కామీద అక్కడక్కడ మరకలు కనిపిస్తున్నాయి. పై టాప్ తీసేసి, మోటార్‌ను ఊరికే తిప్పేస్తున్నాడు. చక్రం గిర్రున తిరిగి పెద్ద మోతచేసుకుంటూ, రైలు ఇంజనులాగ పొగవదిలేసి చప్పున చల్లపడి పోతోంది. ఇంజను స్టార్ట్ అవటంతోనే చలమయ్య ప్రాణాలు కొంత వరకు చేరుకునేవి. ఇంజను ఆగిపోవటం తోడనే చలమయ్యకూడా స్తబ్ధుడయి పోతున్నాడు.

చలమయ్యవుతే కన్నార్పకుండా ఇంజనువంకే చూస్తున్నాడు. దావూద్ నిజంగా కష్టపడి పనిచేస్తున్నాడు. చలమయ్య అంతరాత్మ సంతోషించింది.

'దావూద్ ఇంకా యెంత సేపు పడుతుందంటావు....' చలమయ్య ఆగి ఆగి అన్నాడు.

'నేను ఊరికే కూర్చున్నానుటండీ, వైర్ కనెక్షన్ పోయింది. నా ప్రాణాలు తెగిపోతున్నాయి. చూస్తున్నారుగా మీరు....' దావూద్ నల్లటి మొహంలోంచి ఎర్రటి కళ్ళు చలమయ్యను భయపెట్టినాయి.

చలమయ్య అట్లాగే నిలబడిపోయాడు.

'అట్టా నుంచుంటే ఎట్టా నడుస్తుంది లారీ, కొంచెం మీరుకూడా

సాయం చెయ్యండి....' దావూద్ తన పనేమిటో తాను చేసుకుపోతూనే ఓ విసురు విసిరాడు.

చలమయ్యకు ఏమీ తోచలేదు. ఉన్నవాడు కాస్త రెండడుగులు వేసి, దావూద్ దగ్గరకువచ్చి నిలబడ్డాడు.

దావూద్, చలమయ్య దగ్గరకు వచ్చినట్లు గమనించని వాడులాగ తన పనేమిటో చేసుకుపోతున్నాడు.

చలమయ్యకు ఏమడగాలో అర్థంకావటంలేదు. ఒకడుగు ముందుకు, ఒకడుగు వెనక్కు వేసుకుంటూ కదం తొక్కుతున్నాడు చలమయ్య.

'నన్ను రమ్మన్నావు మరి....నేను....' నీళ్లు నములుతున్నాడు చలమయ్య.

'లారీ విషయం మీకేం తెలుసుబాబు.... సిమెంటు బస్తాల సంగతి నాకేం తెలుస్తుంది....' దావూద్ గట్టిగా చెయ్యిపెట్టి రుద్దుతున్నాడు, ఇంజన్ రాడ్‌ను.

చలమయ్య ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. చలమయ్యకు మహా చెడ్డకోపం వచ్చింది. దావూద్‌ను ఏమైనాసరే, ఏదైనా చేద్దామనుకున్నాడు. తనంత పెద్దమనిషిని, ఓ మామూలు లారీ డ్రైవరు చులకనగా మాట్లాడటమా!

అవును అన్నమాట నిజమే, సిమెంటు బస్తాలసంగతి దావూద్‌కు యేంతెలుస్తుంది? నేను కొన్నధర యెంతో దావూద్‌కు చెప్పాలట. నేను చెప్పింది వూరుకోక అడ్డమైన ప్రశ్నలు. అచ్చగా సిమెంటేనా బాబు అని నన్ను ప్రశ్నలా! అవన్నీ వాడికెందుకంట? బస్తాకు యెంత

చార్జీ అవుతుందో, నాకెంత లాభంవస్తుందో అవన్నీ వాడికే కావాలి? నేను ఎక్కన్నుంచి యీ బస్తాల్ని తెస్తున్నానో ఆ ఆరాకూడా కావాలి. ఈ వ్యాపారం గుట్టంతా వాడికి చెప్పేస్తే నా ప్రయోజకత్వం యేమిటంట! వెధవ. ఒకపూట తింటే, రెండోపూటకు గతిలేదు. వీడా నన్ను ప్రశ్నలు వేసేది! అందుకని ఇప్పుడు యీ ఎగతాళా! అవును. నేను లారీ డ్రైవరుగా అయ్యేరాత నా మొహాన రాసిలేదు, నాకు ఆ ఖర్మం యెందుకూ! కావలసినంత డబ్బుపలుకుబడి వుంటే నాకు యీ డ్రైవింగ్‌తో యేంపనంట! ఎట్లాగయితే నేర్చుకున్నాడులే, వెధవ డ్రైవింగ్ ఒకటి. దానికోసం యింత పొగరా వీడికి!

చలమయ్య శరీరం పెంచుకుంటున్నాడు.

'ఏమిటోయ్ నేను చేసే సహాయం.... అంత లారీ నడపటం చేతకానివాడివి మొట్టమొదట ఎందుకు వప్పుకున్నావంట ...'

'మధ్యలో చెడిపోతుందని నేనేమన్నా అనుకున్నానేమిటండీ మీరట్లా అంటారు ...' రెండు చేతుల్లో దుమ్ము దులిపేసుకున్నాడు దావూద్.

'ఇప్పుడయితే యేమంటావు నువ్వు, మనం వెళ్లటానికే వీల్లేదా...' చలమయ్య గట్టిగానే అడిగాడు.

'వెనకాల లారీలు రానీండి, వాళ్ళదగ్గరైనా అడిగి వైర్ కనెక్ట్ చేస్తాను....' నిమ్మకు నీరెత్తినట్లు అన్నాడు దావూద్.

'వెనకాల లారీలే....' చలమయ్య ఆవలించాడు.

'దావూద్! నువ్విన్నాళ్లనుంచీ లారీలు నడుపుతున్నావే, ఏదైనా ఉపాయంచేసి, మనం బస్తీకిచేరే ఏర్పాటు చూద్దూ....' ప్రాధేయపడుతున్నట్లు అన్నాడు చలమయ్య.

దావూద్ పక్కున నవ్వాడు.

చలమయ్య, దావూద్‌కు అర్థమయ్యేటట్లు ముసిముసి నవ్వులు విసిరాడు.

దావూద్ యింకా పగలపడి నవ్వుతున్నాడు.

'నీ పొట్టకోసం నువ్వడిగావు. కాకపోతే నా వ్యాపారం గుట్టు తెలుసుకుందామనా యేమిటి....' చలమయ్య సాగిపోయాడు.

'చిత్తం....మీరు బస్తాకు అర్ధరూపాయి లాభం అని చెపితే నేను నమ్మనుటండీ. ఆ లెక్కన కట్టి నాకు కూలియిస్తే మరి అన్నీ తెలిసినవారు మీరే....' చేతులు నలుపుకుంటూ దావూద్, చలమయ్య మొహంలోకి చూశాడు.

'వైర్ పోయిందంటే నేను నమ్మానంటావా....' చలమయ్య అదోవిధంగా చూశాడు దావూద్ వంక.

దావూద్ మొహం అవతలవైపుకుతిప్పి ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు.

చలమయ్య జేబులోనికి చెయ్యిపోనిచ్చి, 'దావూద్' అన్నాడు.

దావూద్ చటుక్కున ముందుకు తిరిగాడు.

దావూద్ నవ్వుకుంటూ, పాంట్ ప్రక్కజేబులోకి చెయ్యి కుక్కుకుని, 'మీరు లారీ ఎక్కండి. వైర్ కనెక్ట్‌చేస్తా' అన్నాడు.

చలమయ్య మొహంలో నవ్వులు కనిపించినాయి. లారీ చక్రాలు గిర్రున తిరిగే మోతలో, దావూద్ విరగబడి నవ్వుకుంటూ పోతున్నాడు.

( ఆంధ్ర జనత, 5–8–1956 )